క్లుప్తంగా

మారిటైం టాలెంట్ టెస్ట్‌లో నవోదయ విద్యార్థి ప్రతిభ



అవార్డు అందుకుంటున్న వంశీకృష్ణ

కొమ్మాది: లోనావాలకు చెందిన సముద్ర మారిటైం అధ్యయన సంస్థ, సింగపూర్‌కు చెందిన ఎగ్జిక్యూటివ్ షిప్ మేనేజ్‌మెంట్ సంస్థతో కలిసి అఖిల భారత స్థాయిలో నిర్వహించిన ప్రతిభ అన్వేషణ పరీక్షలో కొమ్మాది జవహర్ నవోదయ విద్యాలయలో 12వ తరగతికి చెందిన విద్యార్థి వంశీకృష్ణ అఖిల భారత స్థాయిలో 48వ ర్యాంక్ సాధించినట్లు ప్రిన్సిపల్ కె. నంజయ్ తెలిపారు. ఈ పరీక్షల్లో దేశ వ్యాప్తంగా 500 పాఠశాలల నుంచి 10వేల మంది విద్యార్థులు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వంశీకృష్ణను పాఠశాల యాజమాన్యం అభినందించింది.

నేడు వైఎస్సార్ ఆసరా ప్రారంభం

పద్మనాభం: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆదివారం వైఎస్సార్ ఆసరా ప్రారంభోత్సవం జరుగుతుందని ఎంపీడీవో కె.ప్రభాకరరావు తెలిపారు. ఉదయం పది గంటలకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. ఇదే ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన మహిళా మార్టును కూడా ఎమ్మెల్యే ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఆసరా లబ్ధిదారులు హాజరు కావాలని ఆయన కోరారు.

విద్యార్థులకు వాటర్ బాటిళ్ల పంపిణీ

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 303 మంది విద్యార్థులకు ఆకాంక్ష ఫౌండేషన్ ఫౌండర్ సూరకాశి తేజ తన తాత సూరకాశి అప్పారావు జ్ఞాపకార్థం శనివారం వాటర్ బాటిళ్లు, పెన్నులు, ప్లాంకులు, స్కేళ్లు పంపిణీ చేశారు. శేరికాండం సర్పంచ్ పల్లంటి చిన్నారావు వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ముద్రగడ్డ సన్యాసిరావు, ఆసరా స్వచ్ఛంద సేవా సంఘం వ్యవస్థాపకుడు రెడ్డిపల్లి జగదీష్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పట్టుదల, కృషితో ఎదగాలి



విద్యార్థులకు అవార్డులు అందజేస్తున్న గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీ రాజీవ్‌కుమార్ మీనా

కొమ్మాది: ప్రతి విద్యార్థి పట్టుదల, కృషితో ప్రయత్నిస్తే సాధించలేనిదంటూ ఏదీ లేదని, బాల్యం నుంచి ఇది అలవరుచుకోవాలని గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీ రాజీవ్ కుమార్ మీనా అన్నారు. తిమ్మాపురం విజ్ఞాన్స్ వరల్డ్ వన్ పాఠశాల వార్షికోత్సవం అంకురన్ పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. క్రీడల్లోనూ, చదువులోనూ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌ఎస్ కళింగ చీఫ్ ఇంజినీర్ జి.కృష్ణ కుమార్, విజ్ఞాన్ సంస్థల సీఈవో శ్రీకాంత్, ప్రిన్సిపాల్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి ఏపీఈఆర్‌సీ పబ్లిక్ హియరింగ్

మధురవాడ: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) సమక్షంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన వార్షికాదాయ అవసరాలు, రిటైల్ ధరలపై ప్రజాభిప్రాయం సేకరణ ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 1 వరకు నిర్వహించనున్నట్టు విశాఖ జోన్–3 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. శ్రీనివాసరావు చెప్పారు. మధురవాడలోని జోన్–3 కార్యాలయం ఆవరణలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 వరకు జరుగుతుందన్నారు. ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం నుంచి కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొని బహిరంగ ప్రజాభిప్రాయం సేకరిస్తామన్నారు. దీనిపై ప్రజలు తమ సూచనలు, సలహాలు ఇవ్వొచ్చని, ముందుగా 94906 06924 ద్వారా సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.



ముఖ్యమంత్రి జగన్ సభకు హాజరైన అశేష జనవాహిని

జనసంద్రమంటే ఇదేనేమో..!



సంగివలస హెలీప్యాడ్ వద్ద సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఒక వైఎస్సార్..ఒక జగన్..ఒక వైఎస్సార్‌సీపీ మార్క్..పార్టీశ్రేణులను కాలర్ ఎగరేసుకునేలా చేసింది. ‘సిద్ధం’ సభకు ఇసుకేస్తే రాలనంత జనం తరలిరావడంతో ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఎన్నడూ లేనంతగా జనప్రవాహంతో హోరెత్తింది. ముఖ్యమంత్రి ఎన్నికల శంఖారావం ‘సిద్ధం’ సభకు ఉవ్వెత్తున తరలివచ్చిన అభిమానులు,నాయకులు,కార్యకర్తలతో సంగివలస సందడిగా మారింది. మహిళలు కూడా పెద్ద ఎత్తున తరలివచ్చారు. అన్నివైపుల నుంచీ అభిమానులు తమ ప్రియతమ ముఖ్యమంత్రి జగనన్న సభకు ప్రదర్శనగా చేరుకున్నారు. ముఖ్యమంత్రి ప్రసంగానికి పార్టీ శ్రేణులు జేజేలు పలికారు. తమ ఆత్మీయ నేతపై ప్రేమాభిమానాలు కురిపించారు. నృత్యాలు, వాయిద్యాలు, ర్యాలీలతో రోడ్లు దద్దరిల్లాయి. జాతీయ రహదారిపై జగన్‌కు స్వాగత కటౌట్లతో కొలువుదీరాయి. –తగరపువలస



సభకు ర్యాలీగా వెళుతున్న జేవీ అగ్రహారం నాయకులు



ఒంటి నిండా పార్టీ రంగులు, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బొమ్మతో యువకులు



సభకు పయనమవుతున్న కాపులుప్పాడ నాయకులు

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని సంగివలసలో శనివారం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్న సభకు మూడోవార్డు నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివెళ్లారు. వార్డు పార్టీ అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు ఆధ్వర్యంలో ఆటోలు, ద్విచక్రవాహనాల్లో పెద్ద బజారు నుంచి తరలివెళ్లారు. వాసుపల్లి కొండబాబు ఇతర నాయకులు పాల్గొన్నారు. అలాగే చిన్నబజారు ప్రాంతం నుంచి అప్పికొండ వీధి సచివాలయం పరిధిలోని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్.ప్రభాకర్‌నాయుడు, నాయకులు ఎర్నింటి అచ్చిబాబు, బోని సంజీవరావు, బోని శ్రీను తదితరుల ఆధ్వర్యంలోను, పట్టణ యువజన విభాగ అధ్యక్షుడు ముక్కి కృష్ణ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తు నాయకులు, అభిమానులు సభకు వెళ్లారు.

ఉప్పొంగిన అభిమానం

సభకు తరలిన వారిలో ముగ్గురు యువకులు ఒంటి నిండా పార్టీ రంగులతో, సీఎం జగన్‌మోహన్ రెడ్డి బొమ్మను అచ్చువేసుకుని అభిమానం చాటుకున్నారు.

జననేత సభకు...

మధురవాడ: జననేత, రాష్ట్ర ముఖ్యమంత్రి సంగివలసలో నిర్వహించిన ఎన్నికల శంఖారావానికి ప్రజలు మధురవాడ పరిసర ప్రాంతాలు నుంచి ప్రవాహంలా తరలి వెళ్లారు. జీవీఎంసీ 5వ వార్డులోని మారికవలస, పరదేశిపాలెం, శివశక్తినగర్, సాయిరాంకాలనీ, శివశక్తినగర్, స్వతంత్రనగర్ పరిసర ప్రాంతాలు నుంచి మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, జేసీఎస్ కన్వీనర్ సురేష్, ముచ్చురామారావు తదితరుల ఆధ్వర్యంలో ఆటోలు, బస్సులు, ద్విచక్రవాహనాల్లో తరలి వెళ్లారు.

7వ వార్డులోని చంద్రంపాలెం, వాంబేకాలనీ, నగరంపాలెం, మల్లయ్యపాలెం, పిలకవానిపాలెం, ఎన్‌జీజీవోస్ కాలనీ, మిథిలాపురి ఉడా కాలనీ పరిసర ప్రాంతాలు నుంచి వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ కుడితి రామారావు, వివిధ విభాగాలు నాయకులు పిళ్లా సూరిబాబు, సింహాచలం ట్రస్ట్ బోర్డు సభ్యుడు పీకేఎం పాత్రుడు, మగ్గూరి వెంకటరమణ తదితరులు ఆధ్వర్యంలో తరలి వెళ్లారు.

భారీగా తరలిన నేతలు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ముత్తంశెట్టి శివ నందీష్

పద్మనాభం: సంగివలసలో శుక్రవారం సాయంత్రం జరిగిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సిద్ధం సభకు భారీగా జనం తరలి వెళ్లారు. మండలంలోని 22 పంచాయతీల నుంచి 30 బస్సులు, వంద ఆటోలు, ప్రత్యేక వాహనాల్లో జనం తరలి వెళ్లారు. మద్దిలో వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, రెడ్డిపల్లిలో వైఎస్సార్ సీపీ నాయకుడు సిరుగుడి ఆదినారాయణ, పద్మనాభంలో వైఎస్సార్ సీపీ నాయకుడు తాలాడ పద్మనాభం వైఎస్సార్ జెండాలు ఊపి బస్సులు ప్రారంభించారు.

దారులన్నీ అటువైపే..



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ముత్తంశెట్టి ప్రియాంక, వైఎస్సార్ సీపీ నేత శ్రావణ్‌కుమార్

కొమ్మాది : ఎన్నికల శంఖారావం పూరించేందుకు తగరపువలస సంగివలస వద్ద ఏర్పాటు చేసిన సిద్ధం సభకు చేరేందుకు దారులన్నీ అటుగా పయనమయ్యాయి. జీవీఎంసీ 4వ వార్డు కొత్తవలస, జేవీ అగ్రహారం, కాపులుప్పాడ, చేపలుప్పాడ, మంగమారిపేట ప్రాంతాల నుంచి వేలాదిగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పయనమయ్యారు. ఎన్నికల యుద్ధానికి తాము సిద్ధమని ప్లకార్డులు ప్రదర్శించి ఆయా ప్రాంతాల నుంచి ర్యాలీగా కదిలారు. అదే విధంగా జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్, ఎండాడ, గుడ్లవానిపాలెం ప్రాంతాల నుంచి నాయకులు, కార్యకర్తలు, కార్లు, ఆటోలు, బైక్‌లపై పెద్ద ఎత్తున సభా ప్రాంగణానికి చేరుకున్నారు. జై జగన్..జైజై జగన్ నినాదాలతో హోరెత్తించారు.



చంద్రంపాలెం నుంచి తరలి వెళ్తున్న నాయకులు, అభిమానులు



మూడో వార్డు పార్టీ అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు ఆధ్వర్యంలో బయలుదేరిన నాయకులు, కార్యకర్తలు



పట్టణ యువజన విభాగ అధ్యక్షుడు ముక్కి కృష్ణ ఆధ్వర్యంలో ..



మధురవాడ నుంచి తరలి వెళ్తున్న 5వ వార్డు నాయకులు



మద్ది నుంచి వెళ్లిన వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజలు



పద్మనాభం నుంచి వెళుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



రెడ్డిపల్లి నుంచి వెళుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజలు

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

నూతన కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గం

మధురవాడ: మధురవాడ ఐటీ సెజ్ వద్ద గల ది అడ్రస్ గేటెడ్ కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం ఎంపికైంది. ఈ సందర్భంగా ఇక్కడ నిర్వహించిన లగ్జరీ అపార్ట్‌మెంట్ ఫ్లాట్ ఓనర్స్ జనరల్ బాడీ సమావేశం కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకొంది.అధ్యక్షుడిగా కేవీ రావు, వైస్ ప్రెసిడెంట్లుగా ఎంవీ ప్రసాద్, రాజ్యలక్ష్మి, సెక్రటరీ బి.సురేష్, ట్రెజరర్ పరమేశ్, జాయింట్ సెక్రటరీలుగా స్మిత, ఎంవీ రమణ, పూసర్ల సురేష్, కార్యవర్గ సభ్యుడిగా హరికృష్ణ తదితరులు విజయం సాధించారు. వీరికి అపార్ట్స్ వాసులు అభినందనలు తెలిపారు.

ఘనంగా తెలుగు వికీపీడియా వార్షికోత్సవం



వికీపీడియా కండువాలతో సభ్యులు

డాబాగార్డెన్స్ : అంతర్జాల విజ్ఞాన సర్వస్వమైన తెలుగు వికీపీడియా వార్షికోత్సవం నగరంలోని ఓ హోటల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడ విజ్ఞాన సృష్టి పేరుతో ఏర్పాటు చేసిన చర్చాగోష్టిలో వికీపీడియా సభ్యులు ఎం.వి. నాయుడు, డాక్టర్ మామిడి హరికృష్ణ, ఆదిత్య కందర్ప, కాకర్ల సజయ తదితరులు పాల్గొని తెలుగులో విజ్ఞానం అందించడంపై చర్చించారు. విజ్ఞానానికి పరిధులు లేవని, అది ఎప్పటికీ మార్పు చెందదన్నారు. తెలుగు సాహిత్యాన్ని భద్రపరిచే ప్రయత్నం చేయాలన్నారు. కార్యక్రమంలో తెలుగు వికీపీడియా సభ్యులు తుమ్మల శిరీష్‌కుమార్, రాజశేఖర్, వీనస్, పవన్ సంతోష్, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.